www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి



పల్లె పండుగ.. సంక్రాంతి

కలెక్టర్ సి.నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, ఇది పల్లెల, రైతుల పండుగ అని, మన పాడిపంటల పండుగగా సంక్రాంతి నిలుస్తుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తమ స్వగ్రామాలకు తిరిగొచ్చి తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, ఇది మనందరి పండుగ అని అన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని నాగరాణి ఆకాంక్షించారు.

కాసో్క.. ఖాకీ..!

కోడి పందేలకు పందెంరాయుళ్లు సన్నద్ధం

నేడు పది గంటల తర్వాత ప్రారంభానికి సన్నాహాలు

పోలీసుల ప్రకటనలను పట్టించుకోనక్కర్లేద్దంటూ ధీమా

కోర్టు ఆదేశాల అమలుపై పోలీసుల దొంగాట

తెలంగాణ, ఇతర జిల్లాల నుంచి భారీగా పందెంరాయుళ్ల క్యూ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

భోగి రోజు సోమవారం కోడిపందేల ప్రారంభానికి పందెంరాయుళ్ల ఉవ్విళ్లూరుతున్నారు. పందేలను అడ్డుకుంటామంటూ పోలీసుల ప్రకటనలను తేలిగ్గా తీసిపారేస్తున్నారు. కోడి పందేలను అడ్డుకునే దమ్ము పోలీసులకు ఉందా అంటూ పందెంరాయుళ్ల సవాల్ విసురుతున్నారు. సోమవారం ఉదయం పది గంటల తర్వాత పందెం కోళ్ల కాళ్ల దువ్వుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. కోర్టు ఆదేశాల అమలుపై పోలీసులు దొంగాట ఆడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. బరులను ధ్వంసం చేస్తున్నట్లు ఒకపక్క ఫొటోలు తీస్తూ.. మరోపక్క బరుల ఏర్పాటుకు అనధికారికంగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పండుగ మూడు రోజులు యథేచ్ఛగా కోడిపందేల నిర్వహణకు ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. కోర్టు ఆదేశాలను అధికార యంత్రాంగం ఏమాత్రం అమలు చేయని పరిస్థితి. కచ్చితంగా పందేలు జరుగుతాయనే ధీమా ఉండటంతో ఊరూవాడా బరుల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. తక్కువగా లెక్కించినా ప్రతి మండలంలోనూ పది నుంచి 15 బరులు ఏర్పాటు చేసేలా పందెంరాయుళ్ల ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. బరుల వద్ద ఏయే ఏర్పాట్లు చేయాలి.. ఎంతమంది వస్తారు.. వచ్చిన వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించాలన్న పలు అంశాలపై ఇప్పటికే నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. గుండాట, మూడు ముక్కలాట సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోడి పందేల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చేవారితో పట్టణాల్లోని హోటళ్ల గదులన్నీ నిండిపోయినట్లు తెలుస్తోంది. పండుగ మూడు రోజులు ఇక్కడే ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పందెంరాయుళ్ల చేరుకుంటున్నారు. ఏయే బరుల్లో పందెం వేయాలన్న దానిపై ముందుగానే నిర్ణయించుకుంటున్నారు. భీమవరం, ఆకివీడు, ఉండి, దెందులూరు నియోజకవర్గాల్లో రూ.లక్షల్లో పందేలు జరిగే బరులు ఉన్నట్లు చెబుతున్నారు. పెద్ద బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు బరుల నిర్వాహకులు ప్రత్యేకంగా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుంటున్నారు. తొలిరోజు భోగి నాడు తక్కువగా లెక్కించినా రూ.50 కోట్లు మేర పందేలు జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పెద్ద పండుగ, కనుమ నాడు భారీగా పందేల జోరు సాగనున్నట్లు చెబుతున్నారు. ఉండి, దెందులూరు వంటి నియోజకవర్గాలు కోడి పందేలకు అడ్డాగా మారుతున్నాయనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లో 47 మండలాలు ఉన్నాయి. మండలానికి పది బరులు ఏర్పాటు చేసినా దాదాపు 470 బరుల్లో కోడిపందేలు జరిగే పరిస్థితి కన్పిస్తోంది. బరుల వద్ద స్థానిక ఎంఎల్ఎ, ఎంపీ, అధికార పార్టీ నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. కోర్టు ఆదేశాల నుంచి తప్పించుకునేందుకు పోలీసులు హడావుడి చేస్తుండటమే తప్ప.. పందేలకు పూర్తిగా సహకరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.



ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాట్లు

జూదాలకు ఆకర్షితులవుతున్న యువత

కోడి పందేల నిర్వహణ ఏయేటికాయేడు పెరుగుతోంది. ఇదంతా పక్కాప్రణాళిక ప్రకారమే జరుగుతోంది. గతంలో ప్రభుత్వాలు అనుమతిస్తాయా, లేదా అనే ఉత్కంఠ భోగి రోజు ఉదయం 11 గంటల వరకూ కొనసాగేది. కోడిపందేల నిర్వహణపై పందెంరాయుళ్ల కోర్టులకు వెళ్లిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోడి పందేలను ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయి. పండుగ మూడు రోజులు పందేలకు ఇబ్బంది ఉండదనే సంకేతాలను ప్రభుత్వం ముందుగానే ఇస్తోంది. కోడి పందేలకు యువత ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సరదాగా చూద్దామంటూ వెళ్లి బెట్టింగ్‌లు కాస్తున్నారు. సామాన్యులు గుండాట, మూడు ముక్కలాటల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. పండుగకు సరదాగా కుటుంబంతో గడపకుండా పందేల బరుల చుట్టూ ఉంటున్న పరిస్థితి ఉంది. యువత పక్కదారి పట్టే పరిస్థితులను ప్రభుత్వమే కల్పిస్తోంది. కోడిపందేలను అడ్డుకునేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయకపోవడమే దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

నేడు 'మీకోసం' రద్దు : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు.

విద్యుత్ భారాలను నిరసిస్తూ..

నేడు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ ఛార్జీల పెంపుదల లేదంటూనే ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఈ నెల 13న భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రజానీకానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన నియంత్రణ మండలి, రాష్ట్ర ప్రభుత్వం ఛార్జీల పెంపు లేదంటూనే సర్దుబాటు ఛార్జీల ద్వారా రూ.వేలాది కోట్లు భారం మోపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ భారాలను ఉపసంహరించాలని, అదానీ స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని, అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

కోడిపందేల అంశంలో హైకోర్టు ఆదేశాలను అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టంగా అమలయ్యేలా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. సంక్రాంతి పేరుతో కోడి పందేలు, గుండాట, జూదం వంటి వాటికి అనుమతుల్లేవని హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా ఇప్పటికే కొంతమంది బడాబాబులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో కోడిపందేల నిర్వహణకు ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కోడిపందేలు, జూదాలు అడ్డుకుని, వాటి స్థానంలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణం

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

భీమవరం : గత 15 రోజులుగా జిల్లాలో టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంనేయులు విమర్శించారు. సార్వాపంట సీజన్లో తరచూ వర్షాలు, మునకతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతూ పంటలు పండించారన్నారు. దీంతో పంటలు లేటుగా రావడంతో పాటు దిగుబడి కూడా తగ్గిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకుండా గత పదిహేను రోజులుగా టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. జిల్లాలో ప్రధానంగా పోడూరు, యలమంచిలి, పాలకొల్లు, ఆచంట, వీరవాసరం, భీమవరం, అత్తిలి వంటి మండలాల్లో ఇంకా 30 వేల టన్నులకుపైగా ధాన్య ఉందని తెలిపారు. పండుగ సమయంలో కూడా చేతికొచ్చిన పంట కొనుగోలు చేయకపోవడంతో ఇటు దాళ్వా పంట పెట్టుబడి అవసరాలతో పాటు కనీసం పండుగ చేసుకునేందుకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పలువురు కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని కొంతమంది దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారన్నారు. సమస్యపై పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు తక్షణం తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ టార్గెట్‌తో సంబంధం లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



తుందుర్రులో ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

శరవేగంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు

హాజరుకానున్న 24,265 మంది విద్యార్థులు

130 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణ

డిఇఒ ఇ.నారాయణ

ప్రజాశక్తి - భీమవరం



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సన్నద్ధత, తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపేలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా సి, డి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డిఇఒ నారాయణ వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాది పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు?

డిఇఒ: విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించాం. 'ఎ' కేటగిరి విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తారు. ముఖ్యంగా సి, డి కేటగిరీల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. స్టడీ అవర్లో చదివించడం, రాయించడం వంటివి ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యంగా ఆదేశించాం. ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక పర్యవేక్షణ చేసేలా చర్యలు చేపట్టాం. పాఠశాల సమయంకన్నా రెండు గంటలు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ఉపాధ్యాయులు, అధికారులు ఏయే చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

డిఇఒ: విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలన్నదే మా తాపత్రయం. దీనికి అన్నివిధాలా చర్యలు చేపట్టాం. స్టడీ మెటీరియల్‌తోపాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో సొంతంగా గణిత దీక్ష మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించాం. ముఖ్యంగా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం.

ప్రశ్న: గతేడాది ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి. ఉత్తీర్ణతా శాతం ఎంతొచ్చింది?



డిఇఒ: గతేడాది 20,785 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 17,707 మంది ఉత్తీర్ణత సాధించారు. దీనిలో ఫస్ట్ క్లాస్ 12,706 మంది సాధించడం విశేషం. సుమారు 3778 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. గతేడాది జిల్లావ్యాప్తంగా 81 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యంగా తీసుకున్నాం.

ప్రశ్న: గతేడాది ఏ సబ్జెక్టులో ఎంతమంది ఫెయిలయ్యారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏం చర్యలు చేపట్టారు?

డిఇఒ: గతేడాది సైన్స్, లెక్కల సబ్జెక్టుల్లో ఎక్కువ మంది ఫెయిలయ్యారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకునేలా చర్యలు చేపట్టాం. ఉదయం అంతా పాఠాలు బోధించి చదివించడం, సాయంత్రం చదివిన దానిపై ప్రతిరోజూ పరీక్ష రాయిస్తున్నాం. ఎక్కువ మంది విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. విద్యార్థులను చదివించడంతోపాటు ఉత్తీర్ణత సాధించేలా పర్యవేక్షించడం ఆ ఉపాధ్యాయుని బాధ్యతగా అప్పగించాం.

ప్రశ్న: ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు?

డిఇఒ: ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల రెగ్యులర్ విద్యార్థులు కలిపి 24,265 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. దీనిలో రెగ్యులర్ విద్యార్థులు 22,037 మంది ఉన్నారు. బాలురు 11,191 మంది, బాలికలు 10,847 మంది ఉన్నారు. అలాగే కంపార్టుమెంట్‌లో మరో 2,228 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: పరీక్షల నిర్వహణకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది అధికారులను నియమించారు?

డిఇఒ: జిల్లావ్యాప్తంగా 130 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. రూట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్లు, ఇన్విజిలేటర్లను నియమించాల్సి ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదించాం. గతంలో మాదిరిగానే సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలూ తీసుకున్నాం.

ప్రశ్న: ఎప్పటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి? ఏ సమయంలో జరగనున్నాయి?

డిఇఒ: మార్చి 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ ఒకటో తేదీతో పరీక్షలు ముగుస్తాయి. మార్చి 17న తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లీష్, 24న లెక్కలు, 26న ఫిజికల్ సైన్స్, 28న బయోలాజికల్ సైన్స్, 29న సాంస్క్రీట్, ఏప్రిల్ 1న సోషల్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 నిమిషాల వరకూ పరీక్షలు జరుగుతాయి. పరీక్షా సమయానికి గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి. నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించే పరిస్థితి ఉండదు. విద్యార్థులు గమనించాలి.

ప్రశ్న: చివరిగా విద్యార్థులకు ఏం చెప్పదల్చుకున్నారు?

డిఇఒ: ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే ఉత్తీర్ణత అంశంలో ఎటువంటి ఆందోళనా పడాల్సిన అవసరం ఉండదు. దానిపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఉపాధ్యాయుల కృషి ఎలానూ ఉంది. తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద తమ పిల్లల చదువు విషయంలో నిరంతరం పర్యవేక్షిస్తే కచ్చితంగా మంచి ఫలితాలను సాధించొచ్చు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ప్రజాశక్తి - వీరవాసరం



వీరవాసరంలో విద్యాదాత రామకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న పూర్వవిద్యార్థులు

పదవ తరగతి పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయికకు వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికైంది. హైస్కూల్ చరిత్రలోనే అత్యధిక మంది పదవ తరగతి విద్యార్థులున్న 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వపు విద్యార్థులంతా ఒక చోట కలుసుకున్న ఈ అపూర్వ ఘట్టంలో ప్రస్తుతం తాతలు, తండ్రులు, తల్లులుగా ఉన్న పూర్వపు విద్యార్థులంతా నాటి పదవ తరగతి విద్యార్థులుగా మారి, నాటి తరగతి గదుల విశేషాలను పంచుకున్నారు. ఈ సంధర్భంగా తమ గురువులను సత్కారించుకుని వారి ఆశీసులు పొందారు. ఈ సందర్భంగా పలువురు గరువులు మాట్లాడుతూ ఎంఆర్‌కె హైస్కూల్ అంటే ఉపాధ్యాయులకు ఒక ధైర్యం ఇస్తుందన్నారు.బపెద్దల ఆదర్శంతోనే పిల్లల అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కలయికకు 2018లో వలవల జానకీరామ్ నాంది పలకగా పంతం రాము, ముద్రగళ శ్రీనివాస్, మల్లుల జైకృష్ణ కృషితో నాటి పూర్వపు విద్యార్థులంతా కలుసుకోవడం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పసందైన విందును ఆరగిస్తూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపిన వారంతా భారమైన మనసుతో వెనుతిరిగారు. ఈ అపూర్వ ఘట్టంలో గురువులు యేలూరి చిట్టిబాబు, హరిగోపాలరావు, రామ చంద్రరావు, తిలక్, వీరవల్లి కోటేశ్వరావు, సావిత్రి, సత్య నారాయణ, అటెండర్ రామకృష్ణలు పాలు పంచుకున్నారు.

పాలకోడేరు : గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1986-1991 మధ్యకాలంలో ఆనాడు చదువుకున్న పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. వారంతా సుమారుగా 50 సంవత్సరాలకు దగ్గర పడినవారు అయితేనే అందరూ తాము చదువుకున్న పాఠశాలలో మళ్లీ ఆనాటి మిత్రులతో కలవాలని నిశ్చయించుకున్నారు. 35 ఏళ్ల తర్వాత వారంతా ఒకే వేదిక మీదకు వచ్చి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులైన హెడ్మాస్టర్ దయానంద రాజు, డ్రిల్ మాస్టర్ సూర్యనారాయణ రాజు, లెక్కల మాస్టర్ బాపిరాజు, సోషల్ మాస్టర్ సొంటి నాగేశ్వరరావు, హిందీ టీచర్ రామలక్ష్మి, తెలుగు టీచర్ అన్నపూర్ణ, క్రాఫ్ట్ టీచర్ బ్రహ్మానందంను ఘనంగా సత్కరించి, గురువుల ఆశీర్వాదాలు పొందారు. అనంతరం గురువులతో ముచ్చట్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.



గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

యల్లాప్రగడను ఆదర్శంగా తీసుకోవాలి

130వ జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరం ముద్దుబిడ్డ డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో రామ్‌లక్ష్మణ్ నగర్ పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలోని యల్లాప్రగడ విగ్రహానికి ఆసుపత్రి డాక్టర్ వీర్ల క్రాంతి, జెవివి ఉపాధ్యక్షులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ కార్యదర్శి పి.సీతారామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెవివి, యుటిఎఫ్ నాయకులు నివాళులర్పించారు. ఉషోదయ హాస్పిటల్ డాక్టర్ నాగిడి హరిచంద్రప్రసాద్ రామ్‌లక్ష్మణ్ నగర్‌లోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాణాంతకమైన, మానవజాతి మనుగడకే ప్రశ్నార్థకంగా నిలిచిన ఎన్నో భయంకరమైన వ్యాధులకు మందులు కనిపెట్టిన ఘనత యల్లాప్రగడ సొంతమన్నారు. అనంతరం పి.సీతారామరాజు సౌజన్యంతో ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భీమవరంలో సైన్స్‌పార్క్‌ను ఏర్పాటు చేసి దానికి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరు పెట్టాలని జెవివి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత మెంటే పార్థసారథి, డాక్టర్ నాగిడి హరిశ్చంద్రప్రసాద్, నంద్యాల భాస్కర్‌రాజు, రాధాకృష్ణ, జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు, కోశాధికారి మల్లుల శ్రీనివాస్, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు, నందమూరి రాజేష్, కొప్పినీడి సూర్యప్రకాష్, ల్యాబ్ సూపర్‌వైజర్ చంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, అల్లు శ్రీను, డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, వై.అజయ్‌కుమార్, ఎ.లోకేశ్వరరావు పాల్గొన్నారు.



యల్లాప్రగడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వాలి

గణపవరం :వైద్య వృత్తికి వన్నె తెచ్చిన యల్లాప్రగడ సుబ్బారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చి గౌరవించాలని పిఎంపిల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నిడమర్తి జయసూర్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యల్లాప్రగడ జయంతి సందర్భంగా ఆదివారం కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరిపల్లి సాయిబాబా మందిరంలో అసోసియేషన్ మండలాధ్యక్షులు మండా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భీమవరానికి చెందిన ప్రముఖ డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అనేక మందులు కనిపెట్టి ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారన్నారు. వైద్యంలో అనేక మార్పులకు నాంది పలికిన మహోన్నత వ్యక్తికి భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ఇచ్చి గౌరవించాలన్నారు. తణుకు శ్రీనిధి హాస్పటల్ వైద్యులు పి.కృష్ణ కిషోర్ మాట్లాడుతూ న్యూరో సమస్యలపై ఎవరూ అశ్రద్ధ చేయొద్దన్నారు. మెదడు వ్యాధుల పట్ల అధునాతన చికిత్స అందుబాటులో ఉందన్నారు. తొలుత యల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు, నేతలు కె.శివశ్రీనివాసరావు, కొటకల అప్పారావు, కెటిఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

13 నుంచి శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవాలు

33 రోజులపాటు ఉత్సవాలు

ఫిబ్రవరి 14న అన్న సమారాధన

ఉత్సవ కమిటీ వెల్లడి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 61వ జాతర మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 13న మధ్యాహ్నం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)చే అమ్మవారి గ్రామోత్సవం, సాయంత్రం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిచే ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఫిబ్రవరి 14న అన్న సమారాధన నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ఏడాది సుమారు రూ.90 లక్షల వ్యయంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం చుట్టూ ప్రత్యేక లైటింగ్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతియేటా మాదిరిగానే 24 పౌరాణిక నాటకాలు, 5 బుర్రకథలు, 9 హరికథలు, 14 సంగీత విభావరిలు, మ్యూజికల్ నైట్స్, 22 కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్తిబాబు, రామాయణం చిన్నారి, కట్టా కొండ, నరహరిశెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాసరావు, మానే భాస్కరరావు, మానే తేజ, ఆకుల సోమేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ నాయకులు

ఆటల పోటీలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆటల పోటీలను ప్రోత్సహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆదివారం పాలకోడేరు మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాల బాలికలకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ హాజరై మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన సంక్రాంతికి ఎంతో గొప్పదనముందన్నారు. రైతు చేతికి పంట వచ్చిన సందర్భంగా వ్యవసాయ పండుగగా సంక్రాంతిని జరుపుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయాలు ఉట్టి పడేలా పండుగలను జరపాల్సిన ప్రభుత్వాలు కోడిపందేలు, జూద క్రీడలు వంటి విష సంస్కృతిని ప్రోత్సహించడం అన్యాయమన్నారు. దేశంలో ఎక్కడ ఉన్నా సొంతూర్లకు వచ్చి జరుపుకునే సంక్రాంతిలో విష సంస్కృతి వల్ల అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చిత్త శుద్ధిగా బాలబాలికలకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, ముగ్గుల పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు శేషపు అశ్రీయ్య, ప్రజా సంఘాల నాయకులు దున్న మరియమ్మ, వీరవల్లి వెంకటేశ్వరరావు, పెద్దలు కంకిపాటి పుష్పనాథం పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

కోడి పందేలు, పేకాట, గుండాట ఆపాలి

పెంటపాడు : కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలను నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు తెలిపారు. ఆదివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాల వద్ద ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, మండల కమిటీ సభ్యులు బంకురు నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు నెల రోజుల ముందే కోడిపందేలు, పేకాట, గుండాట నిషేధించాలని ప్రతి మండలానికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రతి సంవత్సరం ఈ ఆటలు నిర్విఘ్నంగా సాగుతున్నాయని వారు తెలిపారు. ఈ ఆటల వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలై చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం ప్రతి మండలంలోనూ మినీ స్టేడియంలు ఏర్పాటుచేసి యువతకు క్రీడలు ప్రోత్సహించాలని, మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా చంద్రరావు, అల్లు సుబ్బారావు, మీసాల శ్రీనివాస్, సలుమూరి సత్యనారాయణ, కరక వెంకట్రావు పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయం ప్రారంభం

కాళ్ల : పెదఅమిరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణ రాజు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న సన్నిధిలో ఎంఎల్‌ఎలు

కాళ్ల : కాళ్లకూరు వెంకటస్వామి వారిని ఉండి, భీమవరం ఎంఎల్‌ఎలు కనుమూరు రఘురామకృష్ణరాజు, పులపర్తి రామాంజనేయులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్, మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు పాల్గొన్నారు.

జనతా ట్రస్ట్ ఆధ్వర్యాన ఆర్థిక సాయం

ఆచంట : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఇటీవల ఏర్పాటు చేసిన భారత జనతా ట్రస్ట్ ముందుంటుందని ఆ ట్రస్ట్ ఫౌండర్ పారుపల్లి ఏసురత్నం, సెక్రటరీ పొట్టి బాబురావులు అన్నారు. చినమల్లం హరిజన పేటకు చెందిన వికలాంగురాలు మానుకొండ రూతు అలియాస్ అనంతలక్ష్మి తల్లి అనసూయను పోషించుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన నేపథ్యంలో వికలాంగురాలు అనంతలక్ష్మి అనారోగ్య కారణంగా తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవలే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను భారత జనత ట్రస్ట్ ఫౌండర్ పారుపల్లి ఏసురత్నం, సెక్రటరీ పొట్టి బాబురావు, జాయింట్ ట్రెజరర్ పొట్టి పౌలీనలు కలిసి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక చర్యలు : నాయకర్

మొగల్తూరు: గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సుమారు రూ.1.20 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. కాళీపట్నం తూర్పులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, ముత్యాలపల్లిలో సుమారు రూ.61 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, చేపల మార్కెట్‌లోని సీసీ ప్లాట్ ఫామ్, పంచాయతీ టాయిలెట్లు, పేరుపాలెంలో రూ.20 లక్షలతో నేర్పించిన అంతర్గత రహదారులు, కేపీ పాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత రహదారులను ఆయన ప్రారంభించారు. గ్రామాల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట అడ్డాల సూరిబాబు, మేడిది సౌజన్య ప్రభాకర్, నాయకులు, వైస్ ఎంపిపి కైల సుబ్బారావు పాల్గొన్నారు.

'ఆరోగ్య సహాయకుల వెతలు పట్టించుకోండి'

పెనుమంట్ర : వైద్య, ఆరోగ్య శాఖలో ఆరోగ్యసహాయకులను ఉద్యోగాల నుంచి తొలగించి నెల రోజులు దాటిపోయినా, నేటికీ పునర్నియామకానికి నోచుకోకపోవడంతో రాష్ట్రంలోని వందలాది మంది ఆరోగ్యసహాయకులు తీవ్రమైన ఆందోళనతో వున్నారని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరిస్తూ ఆదివారం ఓ ప్రత్యేక లేఖ రాసి పంపారు. రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్యసహాయకుల పాలిట అత్యంత విషాదకరంగా నడుస్తున్నా కొత్త సంవత్సరం, పండుగల వేళ తొలగించిన ఉద్యోగుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్న బాధాకర దుస్థితిని ఈ సందర్భంగా మంత్రికి ప్రసాద్ వివరించారు. ఉద్యోగాల నుంచి తొలగించి నెల దాటినా వీరి పునర్నియామకంపై నేటికీ స్పష్టత లేకపోవడం, ఇటు ప్రభుత్వం నుంచి, అటు సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ప్రకటన రాకపోవడం బాధిత వర్గాన్ని ఎంతో ఆందోళనకు గురిచేస్తున్నాయి. పారామెడికల్, విశేష రాజకీయ అనుభవం కలిగిన మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా కలుగజేసుకుని, హైకోర్టు తుది తీర్పుకు అనుగుణంగా మెరిట్ ఆధారంగా తిరిగి ఆరోగ్యసహాయకుల పునర్నియామకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

గ్రామపంచాయతీకి స్వచ్ఛ రథం బహూకరణ

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామపంచాయతీలో చెత్త సేకరణకు సాయిరామ్ ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం ఎలక్ట్రికల్ ట్రక్ ఆటోను ఉండి ఎంఎల్ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు సుమారు రూ.3 లక్షల విలువచేసే ఎలక్ట్రికల్ ఆటోను కునాదరాజు సుబ్బరాజు బహూకరించడం అభినందనీయమని జ్యోతిక్, సాలువాది సత్కరించారు.

నేరాలు - ఘోరాలు

మద్యం మత్తులో మనవడి హత్య

నరసాపురం: మద్యం మత్తులో తాతామనవడు మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేములదీవి మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన చింతా ఆదినారాయణ మనవడు నాగరాజు(23) ఈ ఘటనలో మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వి.సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న నాగరాజు తన తాత వద్ద ఉన్న మద్యం సీసాలో వాటా అడిగాడు. దీనికి తాత ఆదినారాయణ అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వీరిద్దరూ ఘర్షణపడుతుండగా దగ్గరలో చేపల దుకాణం వద్దకు వచ్చారు. చేపలు అమ్మే దుకాణం వద్ద అందుబాటులో ఉన్న చాకుతో మనవడు నాగరాజు పొట్టలో పొడిచాడు. గాయంతో బాధపడుతూ నాగరాజు ఇంట్లోకి వెళ్లి నిద్ర మత్తులోకి జారుకున్నాడు. ఉదయాన్నే బంధువులు వెళ్లి చూసేసరికి మృతిచెంది ఉండటాన్ని గుర్తించారు. విషయం బయటకు పొక్కకుండా కుటుంబ సభ్యులు నాగరాజు మృతదేహానికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసేందుకు శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న నరసాపురం రూరల్ ఎస్ఐ టివి.సురేష్ సిబ్బందితో కలిసి వచ్చి దహన సంస్కారాలను అడ్డుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు ఉపయోగించిన చాకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుకు తల్లిదండ్రులు చనిపోవడంతో తాతయ్య ఆదినారాయణ దగ్గరే ఉంటున్నాడు. విఆర్ఒ నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఆదివారం ఘటనా స్థలాన్ని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్‌లు పరిశీలించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

తాడేపల్లిగూడెం : మద్యం అక్రమంగా రవాణా చేసినా, బెల్ట్ షాపులు నిర్వహించినా, సుంకం చెల్లించని మద్యం రవాణా చేసినా, అమ్మినా ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసులు బుక్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా అక్రమ మద్యం కట్టడిపై పూర్తి దృష్టి సారించామని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నామని, నాటుసారా అమ్మకం, గంజాయి, తదితర మత్తు పదార్థాల అమ్మకం, సరఫరాల నియంత్రణలో భాగంగా అనుమానిత ప్రదేశాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ, సుంకం చెల్లించని మద్యం అమ్మకాలు ఏమైనా జరిగితే వాటి వివరాలను తనకు 944090433 లేదా స్టేషన్ ఎస్ఐ మురళీ మోహన్ రావు 9440112437, దొరబాబు 9030737532 నంబర్లకు తెలియజేయాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె తెలియజేశారు. ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకోవాలని కోరారు.

కానరాని భోగి పిడకలు


ఆచంటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన భోగి పిడకలు

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ వస్తుందంటే భోగి పిడకల కోసం పిల్లల సందడి నెల రోజుల ముందు నుంచే మొదలయ్యేది. ఎక్కడ ఆవు పేడ కనిపించినా పిల్లలు పోటీపడి మరీ తీసుకు వెళ్లిపోయేవారు. ఆవు పేడ కోసం పిల్లలు తగువులు కూడా పెట్టుకునేవారు. ఎక్కడ చూసినా పిల్లలతో సందడిగా ఉండేది. ఆవు పేడ తప్ప ఎద్దు పేడను కూడా తీసుకునేవారు కాదు. అంతా స్వచ్ఛతగా ఆవు పేడతో పిడకలు వేసుకునేవారు. నెల రోజుల ముందుగా ఎక్కడ గోడలు చూసినా భోగి పిడకలే దర్శనం ఇచ్చేవి.

ఎన్నో రకాలు..

వీటిలో పొడవుగా వేసిన పిడకలను అరటిపండు అని, గుండ్రంగా 5 రంధ్రాలతో వేసిన పిడకలను అమ్మన ముద్దవి, ఒక రంధ్రంతో వేసిన చిన్న పిడకలను భోగి పిడకలను అనేవారు. ప్రతి దండకు ఒక అరటిపండు, అమ్మన ముద్దను వేస్తూ దండలు తయారు చేసేవారు. కానీ నేటి తరం చిన్నారులు, యువకులు ఎక్కడా కూడా భోగి పిడకలు వేసినట్లు కనిపించడం లేదు.

అమ్మకానికి పిడకలు..

ఇంకా విశేషమేమిటంటే భోగి పిడకలు అమ్మకాల స్థాయికి రావడం మన సంస్కృతి ఎంత దూరమవుతుందో దీనిని బట్టి అర్థమవుతుంది. భోగి పిడకల ప్యాకెట్టు రూ.100 చొప్పున మార్కెట్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఏ పని చేసినా భావితరాల కోసం అని మన సంప్రదాయం కొత్త పుంతలు తొక్కుతూ భవిష్యత్ కాలానికి వీటిని చరిత్రగా చెప్పుకునే పరిస్థితి కనిపిస్తుందని నాటి పెద్దలు ఆందోళన చెందుతున్నారు. భోగిమంటల్లో ఈ ఆవు పేడతో చేసిన పిడకలను వేయడం వల్ల కాలిన తరువాత వచ్చు ఆ పొగకు అనేక క్రిమికీటకాలు నశించిపోతాయి. ఆ పొగను మనం పీల్చడం వల్ల కూడా మనలో ఉన్న చెడు క్రిములు నశించి, మంచి కణాలు పుడతాయని నమ్మకం. ఈ భోగి మంటలు వేయడం వల్ల అప్పటి వరకు ఉన్న చలి కూడా తగ్గుతుందని పెద్దలు చెబుతారు.

ప్రకృతికి దోహదం


ఎస్‌విఎన్.శర్మ, పురోహితులు ఆచంట



భోగిమంటల్లో మనం ఆవుపేడతో తయారుచేసిన భోగి పిడకలు వేయడం వల్ల ప్రకృతికి ఎంతో ఉపయోగపడుతుంది. క్రిమికీటకాలు నశించిపోతాయి. నాటి కాలంలో ఎక్కడ చూసినా గోడలపై భోగి పిడకలు కనిపించేవి. నేడు మచ్చుక కూడా కనిపించడం లేదు.

ఆ సందడి లేదు..

కుక్కల సత్యనారాయణ, విశ్రాంతి ఉద్యోగి, ఆచంట



భోగి పిడకలు కూడా అమ్మకాల్లోకి రావడం వింతగా ఉంది. మన సంస్కృతిని మనమే గౌరవించలేకపోతున్నాం. సంక్రాంతి అంటే నెలరోజుల ముందుగా ఆవు పేడ కోసం రోడ్లన్నీ పిల్లలతో సందడిగా ఉండేవి. నేడు ఎక్కడా ఆ సందడి కనిపించడం లేదు. చివరికి భోగి పిడకలు అమ్మకాల స్థాయికి రావడం మన సంస్కృతి ఎంత దూరమవుతుందో దీన్ని బట్టి అర్థమవుతుంది.

సంప్రదాయాలను గుర్తుచేసేదే సంక్రాంతి

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మనసంస్కృతి, సాంప్రదాయాలను గుర్తుచేసేదే సంక్రాంతి పండుగని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామ స్థాయి ముగ్గుల పోటీలలో విజేతలకు ఆదివారం డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామస్థాయి ముగ్గుల పోటీలను డాక్టర్ దాట్ల వెంకట రామరాజు నిర్వహించడం అభినందనీయమన్నారు. లక్కీ ట్రిప్‌లో లాటరీ నిర్వహించగా వి.పల్లవి లక్కీ ట్రిప్ బహుమతిని సాధించింది. చక్కగా ముగ్గులు వేసిన జి.నాగమణి మొదటి బహుమతి గ్రైండర్, ఎం.మౌనిక రెండవ బహుమతి మిక్సీ, ఎం.యశోద మూడో బహుమతి కుక్కర్‌లు బహుమతులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, మాజీ జెడ్‌పిటిసి అడ్డాల పద్మావతి నాగరాజు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు, దాట్ల సత్యనారాయణరాజు పాల్గొన్నారు.


కాళ్లకూరులో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ

మొగల్తూరు : ప్రతిఒక్కరూ సంక్రాంతి పండుగను ఆహ్లాదంగా జరుపుకోవాలని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని పాతకాలవ సెంటర్ ప్రాంతంలో జనసేన యూత్, పాతకాలవ సెంటర్ శెట్టిబలిజ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్ మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాలలో కాంతి నింపాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగిమంటను వారు ప్రారంభించారు. అనంతరం మొగల్తూరులోని అగ్రహారంలో ఉన్న వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ యు.గీతారాంబాబు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు స్లో సైక్లింగ్, లెమన్ అండ్ స్పూన్, కబాడీ, మ్యూజికల్ ఛైర్స్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. హరే శ్రీనివాస భక్త బృందం చిన్నారుల మురళీ కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహుమతులను నాయకర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల రాంబాబు, బొక్క చంటి, పండు, నిప్పులేటి రామారావు ఉన్నారు.

నరసాపురం: మండలంలోని చిట్టవరం గ్రామంలో అంజనాపుత్ర, పవన్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్స్ వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి బహుమతులందించారు. పోలిశెట్టి సత్తిబాబు, బాబి, కోపల్లి శ్రీను, గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : సంక్రాంతి సందర్భంగా ఆచంటలో ఆచంట యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆచంట శివారు ఒక ప్రయివేట్ లేఔట్ లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. కొడమంచిలి గ్రామంలో కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ప్రముఖులకు యుటిఎఫ్ నివాళులు

భీమవరం : స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ నేత మైనేని వెంకటరత్నం వర్ధంతి, ప్రపంచ మానవాళి ప్రాణప్రదాత డాక్టర్ ఎల్లాప్రగడా సుబ్బారావు, భారతీయ తత్వవేత్త స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శిలు సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్యను అందించాలి'

ఆకివీడు : నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు వారంతట వారే వస్తారని ఆ మేరకు సమాచారం సమాజంలోకి అందవలసిన అవసరం ఉందని మాజీ మంత్రి, మాజీ టిటిడి ఛైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. మండలంలోని దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాపిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులే దేశ భవిష్యత్‌కు పునాదులని, వారి భవిష్యత్తుకు మీ కృషి ప్రధానమని ఆయన అధ్యాపకులకు సూచించారు. కళాశాల అభివృద్ధికి ఎందరో కృషి చేశారని అందులో తనకు కూడా వ్యవస్థాపకులు మూర్తి రాజు కొంత అవకాశం కలిగించడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థి సంఘం నాయకులు వీరభద్రరావు గుంట్ల కృష్ణ, స్థానిక ప్రముఖులు వానపల్లి బాబురావు, విజిలెన్స్ డిఎస్‌పి వెంకటేశ్వరరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ రిటైర్డ్ కోఆర్డినేటర్ బాలకృష్ణ రాజు పాల్గొన్నారు. ప్రారంభంలో స్వర్ణోత్సవాల సూచికగా పైలాన్ ఆవిష్కరించారు.

ప్రతిఒక్కరూ నీలాద్రిరాజును ఆదర్శంగా తీసుకోవాలి

కాళ్ల: కాళ్లకూరు గ్రామాభివృద్ధిలో స్ఫూర్తి ప్రదాత డాక్టర్ నీలద్రిరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంఎల్ఎ రఘు రామకృష్ణరాజు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ పెన్మెత్స వెంకట నీలాద్రిరాజు ఆర్థిక సహకారంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన నవీకరణ, మంతెన వెంకటరాజు స్మారక గ్రంథాలయం, తపాలా శాఖ కార్యాలయాలను, మంచినీటి చెరువుగట్టుపై వ్యాయామ పరికరాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవికాలం నాటికి నియోజకవర్గంలో ఉన్న 70 గ్రామాల్లో కనీసం 30 గ్రామాల్లో చక్కటి వాతావరణం ఉండేలా మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ నీలాద్రి రాజు తన తండ్రి సత్యనారాయణ రాజు జ్ఞాపకార్థంగా వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ నీలాద్రి రాజును స్ఫూర్తిదాయకంగా తీసుకుని ప్రతి ఒక్కరూ వారి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో సైనికుల సేవలు అమోఘం : మంత్రి నిమ్మల

పాలకొల్లు : దేశ రక్షణలో సైనికులు చేస్తున్న కృషి, పట్టుదల వల్లే దేశంలో ప్రజలు శాంతియుతంగా ఉన్నారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో జిల్లాలో రిటైర్డ్ పారా మిలిటరీ గ్రూపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ సరిహద్దుల్లో గడ్డకట్టే చలి, వేసవిలో దారుణంగా ఎండ, అధిక వర్షపాతం ఉన్న దేశాన్ని కాపాడాలనే కాంక్షతో కృషిచేస్తున్న సైనికులకు వందనం అన్నారు. వారు దేశాన్ని ఒక కుటుంబంగా భావించి కృషి చేయడం వల్ల తాము కుటుంబాలతో హాయిగా జీవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికులు, సిఆర్‌పిఎఫ్ జవాన్లను మంత్రి సన్మానించారు.

కోడిపందేల బరులకు సన్నాహాలు!


పాలకొల్లు రూరల్: పందేలకు సిద్ధంగా ఉన్న బరులు

ప్రజాశక్తి - కాళ్ల

కోడిపందేల నిర్వహణకు మండలంలోని పలు ప్రాంతాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. పందేలు నిర్వహించేందుకు అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఏటా సంక్రాంతికి ముందు యంత్రాంగం హెచ్చరికలు చూడకపోవడం సర్వ సాధారణమే. ఈ ఏడాదీ అదే జరుగుతుందని నిర్వాహకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం, మాలవానితిప్ప తదితర గ్రామాల్లో సంక్రాంతి క్రీడా పోటీల పేరిట ఇప్పటికే స్థలాలను చదును చేసే పనులు చేపడుతున్నారు.

జూదాలదే హవా..

సంక్రాంతి పండుగలో కొన్ని ప్రాంతాల్లో బరి నిర్వాహకులు, జూదక్రీడలు నిర్వహించే వారికి, పందెంగాళ్లకు మధ్య అంతర్గత ఒప్పందాలు జరిగిపోతున్నాయి. బరి ప్రాంగణంలో గుండాట, కోతాట, నంబరు పందేలు తదితర జూదక్రీడలు జోరుగా సాగుతాయి. వీటి నిర్వహణకు పండగ మూడు రోజులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం.

పాలకొల్లు రూరల్: మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రోడ్లన్నీ పండుగకు వస్తున్న వాహనాలతో రద్దీగా ఉన్నాయి. పూలపల్లి, దిగమర్రు, చింతపర్రు, వడ్లవాని పాలెం తదితర గ్రామాలలో భారీ స్థాయిలో కోడిపందేలు, గుండాట కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పందెంలో రాజకీయ కోడి గెలుస్తుందా? పోలీసు కోడి గెలుస్తుందా అనేది మరికొద్ది గంటలలోనే తేలనుంది. పూలపల్లి బైపాస్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పక్కన భారీ ఏర్పాట్లతో పందెం రాయుళ్ల నిమగ్నమై ఉన్నారు. ఈ పందెపు బరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. అయినా పోలీసులు తొంగి చూడని వైనం. పోలీసులు కోడిపందేలు, గుండాట, పేకాట ఆడకూడదు, ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఏర్పాటుచేసిన చోటనే పందెం రాయుళ్ల బరులను, గుండాటకు, కోతాటకు సిద్ధం చేశారు. తిరునాళ్లను గుర్తుచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఎత్తున కోట్ల రూపాయలు చేతులు మారే సమయం ఆసన్నమైంది. ఈ పందేల కోసం తెలంగాణ, కర్ణాటక నుంచి అనేకమంది పందెం రాయుళ్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇప్పటికే హోటల్ రూంలు బుక్ చేసుకుని రెడీ అయ్యారు. దీంతో హోటల్ రూములు దొరక్క కొంతమంది ఇబ్బంది పడ్డారు. హోటల్ యజమానులు ఉన్న ధరల కంటే అధికంగా రూములను కేటాయిస్తున్నారు. ఈ సంక్రాంతి బరిలో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా జూదాలను నివారిస్తారా లేక ఎప్పటిలాగే చూసిచూడనట్లు వదిలేస్తారా అనేది వేచి చూద్దాం.

ఆచంట : కోడిపందేలపై ఉన్నత న్యాయస్థానాల నిషేధం మరో పక్క, పోలీసుల హెచ్చరికలు ఇవేమీ పందెం రాయుళ్లకు కళ్లెం వేయలేకపోతున్నాయి. ఎన్ని హెచ్చరికలు చేసినా పండుగ మూడు రోజులు పందేలు కాయమంటూ పందెం రాయుళ్ల నిర్వాహకులు గుట్టుగా ఏర్పాటులో నిమగ్నమయ్యారు. సంక్రాంతి సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 20 చోట్ల కోడిపందేలు, జూదం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఏక్షణంలోనైనా అనుమతులు వస్తాయని, పోలీసులు పచ్చ జెండా ఊపగానే బరిలో దిగాలని ఎదురుచూస్తున్నారు. మరోపక్క నిర్వాహకులు బరులు వేలంపాటలు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. పందేలకు అడ్డుకట్ట ఎలా వేస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది. ఆచంట నియోజకవర్గంలో ఏటా సుమారు 20 చోట్ల కోడిపందేలు వీటి ముసుగులో పేకాట, గుండాట, కోతాట రాత్రింబవళ్లు నిర్వహిస్తున్నారు. మండలంలో ఆచంట, వల్లూరు, పెనుమంట్ర మండలంలో మార్టేరు, జుత్తుగా, ఆలమూరు, పోడూరు మండలంలో పోడూరు, గుమ్ములూరు, తూర్పుపాలెం, వద్దిపర్రు, చింతల గరువు, జిన్నూరు, మట్టపర్రు, కవిటం, పెనుగొండ మండలం పెళ్లికూతురమ్మ చెరువు, కోడిపందేల దెబ్బ, వడలి, ముల్లపర్రులలో పందేలు జరుగనున్నాయి. ప్రధానంగా మార్టేరు, పోడూరు, వడలి, వద్దిపర్రు, చింతల గరువు, గుమ్ములూరులలో ఏటా పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి.

స్టేషన్లకు భారీ ఆదాయం

సంక్రాంతి సందర్భంగా జరిగే పందేలు, జూదం వల్ల అనేకమంది జేబులకు చిల్లులు పడుతుండగా పోలీస్ స్టేషన్‌కు మాత్రం కాసుల పంట కురుస్తుందనేది బహిరంగ రహస్యం. యేట మాదిరిగానే ప్రస్తుతం కూడా భారీ స్థాయిలో ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. పందేలు నిర్వహించే నిర్వాహకులు, జూదగాలు కూడా పెద్ద ఎత్తున సొమ్ములు చెల్లించేందుకు సిద్ధమవుతారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద హైకోర్టు ఉత్తర్వులు, పోలీస్‌ల హెచ్చరికల నేపథ్యంలో ఎప్పటి మాదిరిగా కోడి గెలుస్తుందా లేదా ఖాకీలు విజయం సాధిస్తారా అనేది మరికొన్ని గంటల్లో తేలనుంది.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో కోడిపందేలు ఏర్పాటుకు నిర్వాహకులు సన్నద్ధం అవుతున్నారు. సంక్రాంతి పండుగలు పురస్కరించుకుని కోడిపందేలు ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో బరులను ఏర్పాటు చేశారు. ఒకవైపు కోడిపందేలు నిర్వహించడం కుదరదని అధికారులు బరులను పాత్రలతో దున్నిస్తున్నారు. అయినా పందురా ఇల్లు వెనుకంచి వేయకుండా బరులను సిద్ధం చేస్తున్నారు. సోమవారం నుంచి పందేలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు. గ్రామాల్లో సుమారు పది బరులు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి ఆనుకుని సుమారు ఐదు బరులు ఏర్పాటు చేశారు.

నేటి యువతకు వివేకానందుని జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - గణపవరం

ప్రపంచ దేశాలకు భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన వ్యక్తి స్వామి వివేకానందని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని అఖిల భారత హ్యాండ్ లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం గణపవరంలో జరిగిన జయంతి సభలో పాల్గొని మాట్లాడారు. వివేకానంద చికాగో సదస్సులో తన ప్రసంగం ద్వారా మనదేశ గొప్పతనాన్ని వివరించి, ఇతర దేశాలలో దేశంపట్ల గౌరవాన్ని పెంపొందించారన్నారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నడంపల్లి శ్రీరామ్, నడంపల్లి కోటి, అదపరెడ్డి సీతయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు సూచించారు. నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద జాతీయ యువజన దినోత్సవాన్ని(స్వామి వివేకానంద జయంతి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ మహనీయుడు స్వామి వివేకానంద అని ప్రశంసించారు. దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్ రాయపూడి మాట్లాడుతూ ఉక్కు కండలు, ఇనుప నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువకులే దేశానికి నిజమైన ఆస్తి అని ప్రబోధించిన గొప్ప వ్యక్తి వివేకానంద అని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

పలుచోట్ల పశువుల షెడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ పాడి పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మినీగోకులం షెడ్డును ఆదివారం నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద పెంచే ఉద్దేశంతో ప్రతి ఒక్క లబ్ధిదారునికి మినీ గోకులం అందించాలని ఎన్ఆర్ఇజిఎస్‌లో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. మండలంలో మొదటి విడతగా 44 మినీ గోకులాల షెడ్లను మంజూరు చేసినట్లు నాయకర్ తెలిపారు. ప్రతి పాడిరైతు ప్రభుత్వం అందించే సహకరణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారిని జి.నీలిమ, ఐ.సురేంద్ర ఉన్నారు.

ఉండి: ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఉండి ఎంఎల్ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలోని వాండ్రం గ్రామంలో ఆదివారం పాడి రైతుల సంక్షేమం కోసం నిర్మించిన మినీ గోకులంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల కోసం ప్రభుత్వం అధికంగా నిధులు ఖర్చు చేస్తుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ గ్రామంలోని మురుగు బోదేలు ఆక్రమణకు గురయ్యాయని రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులు సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలలో పాల్గొని విచిత్ర వేషధారణగా ఉన్న చిన్నారులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, ఎంపిటిసి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా రైతులకు పశువుల షెడ్లు నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. నియోజకవర్గంలోని తణుకు మండలం మండపాకలో, అత్తిలి మండలం వరిగెడులో, ఇరగవరం మండలం రేలంగి గ్రామాల్లో ఈ పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్న గోకులం షెడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, రైతులు పాల్గొన్నారు

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పాలకొల్లు : అత్యవసర సమయాల్లో ప్రయివేటు వైద్యం పొందిన సిఎం సహాయనిధి నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. 70 మంది నిరుపేదలకు రూ.60 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సిఎం సహాయ నిధిని పునరుద్ధరించి, నిరుపేదల వైద్యానికి కొండంత అండగా సిఎం చంద్రబాబు సహాయపడుతున్నారని మంత్రి తెలిపారు. పాలకొల్లులో శనివారం రాత్రి బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో పాలకొల్లు పట్టణ, 4 మండలాలకు చెందిన నిరుపేదలకు సిఎం సహాయనిధి చెక్కులు మంత్రి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి సంయుక్తంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సిఎం సహాయనిధి కింద ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన లేదని, పేషెంట్లను పలకరించే సమయం వారికి లేదని అన్నారు. ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

పాలకొల్లు : స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అయినా ఇంకా నూరు శాతం దళితులు ఉన్న వాడల్లో కనీసం రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడం దారుణమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు జాంపేటలో మాజీ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య పాల్గొన్నారు.